ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 20.0

ANDHRAJYOTHY

3



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

బుధవారం 26 ఫిబ్రవరి 2025

2న వనపర్తికి సీఎం రేవంత్‌రెడ్డి రాక

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2న వనపర్తికి ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవితో కలిసి ఆయన సీఎంను కలిశారు. వనపర్తిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన దాదాపు రూ. 1000 కోట్లకు ప్రతిపాదనలను సీఎంకు అందజేసినట్లు తెలిపారు. సీఎం రాకతో వనపర్తి రూపురేఖలు మారనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.



రేవంత్‌రెడ్డికి వనపర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రతిపాదనలు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి

- ఎక్లాస్‌పూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేస్తుండగా ఘటన 5

ఫైనాన్స్ డబ్బు చెల్లించలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- శాంతినగర్‌లో ఘటన 4

జడ్చర్లలో బిహార్ యువకుడి హత్య

- బాత్‌రూమ్‌లో పడి ఉన్న మృతదేహం 5

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

- కుమార్తెను పాఠశాల నుంచి తీసుకొచ్చేందుకు వెళ్లిన దంపతులు
- ఇంటికి తిరిగి వచ్చే సరికి సంఘటన 5
- 5 తులాల బంగారం, రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

జాడ లేక.. కానరాక..

గల్లంతైన వారి జాడ వెతికేందుకు రప్పించిన స్నిపర్ డాగ్




- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద నాలుగు రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ
- సొరంగంలోని బురద తొలగించేందుకు సహాయక బృందాల ప్రణాళికలు
- జార్ఖండ్ నుంచి వచ్చిన బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- స్నేహితులు ఎలా ఉన్నారో? ఎప్పుడొస్తారోనని తోటి కార్మికుల ఎదురుచూపులు
- టన్నెల్‌లో గాలి తక్కువ.. ఆహారం లేక పరిస్థితి ఉత్కంఠ



టన్నెల్ లోపలికి వెళ్లేందుకు తాళ్లు, థర్మకోల్ షీట్స్ ఇతర సామగ్రితో లోకో ట్రైన్ ఎక్కుతున్న రెస్క్యూ బృందాలు

మహబూబ్‌నగర్, దోమలపెంట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పనుల్లో ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడిచిపోయింది. అందులో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికులు ఎలా ఉన్నారనే విషయంలో ఎలాంటి సమాచారం లభించడం లేదు. పూర్తి స్థాయి నమ్మకం, భరోసాతో సహాయక చర్యలు చేపడుతున్నా, బురద నీరు భారీగా పేరుకుపోవడంతో రెస్క్యూ బృందాలు ముందుకు కదల్లేకపోతున్నాయి. శనివారం ఉదయం ప్రమాదం జరిగితే అదే రోజు రాత్రి 10.30 గంటలకు మొదటి బృందం లోపలకు వెళ్లింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పదిమార్లు వివిధ ఏజెన్సీల బృందాలు లోపలకు వెళ్లి.. పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. బురద క్లియర్ చేయడం ప్రధాన సమస్యగా

(మిగతా 4లో..)



టన్నెల్ నుంచి మోటార్ల ద్వారా బయటికి తోడుతున్న నీరు

కుటుంబ సభ్యుల ఎదురుచూపులు..

టన్నెల్‌లో చిక్కుకుపోయిన కార్మికుల్లో కొంతమంది కుటుంబ సభ్యులు కంపెనీ బేస్ క్యాంపు వద్దకు మంగళవారం ఉదయం చేరుకున్నారు. జార్ఖండ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు గూమ్లా జిల్లా కలెక్టర్ మైనింగ్ జిల్లా అధికారి అవినాశ్, మరో అసిస్టెంట్‌ను ఇచ్చి.. నలుగురు కుటుంబ సభ్యులను తీసుకువచ్చారు. కార్మికులు టన్నెల్‌లో ఇరుక్కుపోయినప్పటి నుంచి తాము ఆందోళనలో ఉన్నామని, అధికారుల ఆదేశాలతో తమను ఇక్కడకు తీసుకువచ్చారని చెబుతున్నారు. తమ కుటుంబ సభ్యుల ఆచూకీ లభించే వరకు ఇక్కడే ఉంటామని బోరున విలపిస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాల్లో ఉండి.. ఉపాధి లేక ఇంతదూరం తక్కువ వేతనం కోసం వస్తే.. ఇప్పుడు ప్రాణాలే పోయే పరిస్థితి వచ్చిందని ఆందోళన చెందుతున్నారు. అలాగే క్యాంపుల్లో ఉన్న వారి తోటి కార్మికులు కూడా తమ స్నేహితుల కోసం ఎదురుచూస్తున్నారు. తమతో రోజూ కలిసి ఉండి.. పనిలో.. ఇతర సమయాల్లో సరదాగా గడిపే వారు నాలుగు రోజులుగా కనిపించక పోవడంతో వారిలో కూడా భయాందోళన నెలకొని ఉంది. సహాయక బృందాలు చిక్కుకున్న వారిని తొందరగా తీసుకురావాలని కోరుతున్నారు.

రూ.1,003 కోట్లతో.. ఉపాధి ప్రణాళిక

2 కోట్ల పని దినాల కల్పనే లక్ష్యం

- 2025-26 జాబితా సిద్ధం
- గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు
- నిర్దేశించిన పనులకే ప్రాధాన్యం
- ఒండ్రుమట్టి తరలింపు, కందకాలు, ఫారంపాండ్ తవ్వకం, షెడ్ల నిర్మాణం

జిల్లాల వారీగా పనులు, పేమెంట్ ప్రణాళిక ఇలా..

జిల్లా	పని దినాలు	లేబర్ పేమెంట్ (రూ.కోట్లలో)	మెటీరియల్ పేమెంట్ (రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	85,25,900	255,78,00,000	170,52,00,000
వనపర్తి	26,00,000	78,00,00,000	52,00,00,000
నాగర్‌కర్నూల్	38,30,,000	114,90,00,000	76.60,00,000
గద్వాల	23,84,972	71,54,91,600	47,68,00,000
నారాయణపేట	27,24,460	81,73,38,000	54,57,00,000
మొత్తం	2,00,65,332	601,96,29,600	401,37,00,000

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనుల ప్రణాళిక రెడీ అయ్యింది. రెండు కోట్లా 65 వేలా 332 పని దినాలు కల్పించాలని నిర్దేశించగా, అందుకు కూలీలకు రూ.601 కోట్ల నిధులను ప్రతిపాదించారు. గ్రామ సభల ద్వారా ఈ పనులను గుర్తించారు. వ్యవసాయ అనుబంధ, రైతులకు ప్రయోజనం కలిగించే వాటికే ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో ఒక పని చేపట్టి, దానిని మధ్యలోనే వదిలేసి కొత్త పనులు చేపట్టేవారు. ఇప్పుడు అలా కాకుండా ఒక పని 30 శాతం చేస్తే.. అది పూర్తి చేస్తేనే మరో పని అప్పగించనున్నారు.

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి 4



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

చేనేత పొదుపు నిధి దరఖాస్తుల పరిశీలన

హైదరాబాద్. నల్గొండ, జనగాం జిల్లాల నుంచి వచ్చిన తొమ్మిది మంది అధికారుల బృందం 4

నల్లమలలో చెంచుల జాతర

- నల్లమల అడవిలో భౌరాపూర్ క్షేత్రం
- కొలువైన భ్రమరాంబిక, మల్లికార్జునులు
- చెంచుల సంప్రదాయంలో కల్యాణోత్సవం
- నాలుగు జిల్లాల నుంచి తరలిరానున్న గిరిజనం
- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి 5
- వాహనాల రాకపోకలకు అటవీశాఖ అనుమతి

దక్షిణకాశీలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- తొలిరోజు యాగశాల ప్రవేశం, త్రిశూల పూజలు



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు 5

కల్తీకి అడ్డా..

- గద్వాల జిల్లాలో జోరుగా కల్తీ ఆహార పదార్థాలు
- గంజిపేట, కుంటవీధి కాలనీలలో తయారీ
- మాజీ ప్రజాప్రతినిధి అండతో చెలరేగుతున్న వ్యాపారులు
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లోపమే కారణమంటున్న స్థానికులు

కల్తీ ఆహారపదార్థాల తయారీకి జోగుళాంబ గద్వాల జిల్లా అడ్డాగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందాలనే దురాశతో కల్తీ ఆహార పదార్థాల తయారీకి పూనుకున్నారు. గద్వాల పట్టణంలోని వివిధ కాలనీలలో అల్లం, వెల్లుల్లి పేస్టు పసుపు, కారంపొడి కల్తీ చేసి సొమ్ముచేసుకుంటున్నారు. అదేవిధంగా అయిజ కేంద్రంగా నకిలీ వంటనూనె దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ దందాకు ఓ మాజీ ప్రజాప్రతినిధి అండదండలు మెండుగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

4 - గద్వాల క్రైం, ఆంధ్రజ్యోతి



కల్తీ వస్తువులతో తయారు చేసిన అల్లం, వెల్లుల్లి పేస్టు, అల్లం పేస్టు తయారీకి ఉపయోగించే రసాయనాలు, యాసిడ్ (ఫైల్)

సంపునీటిలో పడి వ్యక్తి మృతి

తెలకపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దూరులో సంపులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం.. ఈ కరుణాకర్ (35) సోమవారం నాగర్‌కర్నూల్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి వచ్చి తనపొలంలో మొక్కజొన్న చేనుకు నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. అక్కడ సంపు మీద ఉన్న మోటారు పైపు ఊడిపోయి నీటిలో పడగా అతను మోటారు పైపును బయటకు తీసే క్రమంలో నీటిలో పడిపోయాడు. ఈత రాక చనిపోయాడని, అతడి మృతిపై అనుమానం లేదని, మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరుశనగ పంట దగ్ధం

- సుమారు రూ.3 లక్షలకు పైగా నష్టం

వెల్దండ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో తోడేటి లక్ష్మారెడ్డికి చెందిన సుమారు 60 క్వింటాళ్ల వేరుశనగ పంట దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే... రైతు లక్ష్మారెడ్డి వేరుశనగ పంటను నూర్పిడిచేసి సుమారు వంద క్వింటాళ్లకు పైగా పొలంలో రాసులుగా పోసి ఉంచాడు. పంట విక్రయించేందుకు మంగళవారం వ్యాపారికి శాంపిల్ చూపించేందుకు కల్వకుర్తికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి వేరుశనగ కుప్పకు నిప్పంటుకుంది. అప్రమత్తమైన సమీప రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకునేలోపే సగం పంట పూర్తిగా దగ్ధమైంది. మిగతా పంటసైతం మసిబారిపోయింది. విద్యుత్ వైర్ల నుంచి నిప్పురవ్వలు పడి ప్రమాదం జరిగి ఉండొచ్చునని భావిస్తున్నారు. పూర్తిగా దగ్ధమైన పంట విలువ సుమారు రూ.3 లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.



నిప్పంటుకున్న వేరుశనగ కుప్ప

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ప్రధానమంత్రి 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా జనవరి 22 నుంచి మార్చి 8 వరకు మహిళా సాధికారత, బాలికల సంరక్షణపై దేశవ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మంగళవారం వనపర్తి పట్టణంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, ఇంకా ఎదగాలని సూచించారు. ఆడపిల్ల అనగానే చిన్న చూపు చూడకుండా తల్లిదండ్రులు మగ పిల్లలతో సమానంగా వారికి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. ఒక మహిళ చదువుకుంటే ఆమె తన పిల్లలకు సమాజం పట్ల అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ ఆర్థిక భారాలను సైతం నేడు స్త్రీ శక్తి లాగుతోందని అన్నారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా అధికారి రాంబాబు, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ చెన్నమ్మథామస్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సరస్వతి, డీఆర్‌డీఏ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


టన్నెల్ వద్ద ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపు


నీటిని తోడేందుకు తెచ్చిన మోటార్లు, జనరేటర్, ఇతర సామగ్రి


లోకో ట్రైన్‌లో టన్నెల్ లోపలికి వెళ్తున్న రెస్క్యూ బృందం


లోపలి నుంచి నీటిని బయటికి పంపించేందుకు టన్నెల్‌లో ఏర్పాటు చేసిన పైపులు

జాడ లేక.. కానరాక

(3వ పేజీ తరువాయి)

మారింది. దాన్ని బయటకు తరలించే వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అయితే ప్రతీసారి వెళ్లిన బృందాలు కొత్తగా ఎదురవుతున్న సమస్యలను పరిగణలోకి తీసుకుని.. వాటిని ఏజెన్సీల కో ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌కు పంపిస్తున్నారు. ఆ తర్వాత మరో బృందం వాటిని ఎలా పరిష్కరించవచ్చో అందుకు అవసరమైన ఉపకరణాలు తీసుకుని ముందుకు వెళ్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం 3:40 గంటలకు వెళ్లిన బృందం రాత్రి 10 గంటల వరకు తిరిగి రాగా, మంగళవారం మధ్యాహ్నం 12:08 గంటలకు మరో బృందం పూర్తిస్థాయి సామగ్రితో లోపలకు వెళ్లింది. ప్రమాదం జరిగి నాలుగు రోజులు కావడంతో కార్మికుల ప్రాణాలపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఏజెన్సీలన్నీ తమ శక్తియుక్తులను కూడదీసుకుని పనిచేస్తున్నప్పటికీ, సమయం గడిచిపోతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది.

లోపల ఎలా ఉన్నారో..

ఎస్ఎల్‌బీసీ సొరంగం మిగతా సొరంగాల కంటే భిన్నమైంది. ఇందులో ఎస్కేప్ రూట్స్ ఏం ఉండవు.. టీబీఎం పోతున్నా కొద్ది.. సెగ్మెంట్ బ్లాకులు అమర్చుకుంటూ ముందుకు వెళ్లాలి. అవతలివైపు తగిలేంత వరకు ఎగ్జిట్ ఉండదు.. ఒకవేళ రావాలనుకున్నా, వెళ్లిన మార్గంలోనే తిరిగి రావాలి. ఇప్పుడు ఆ భిన్నమైన డిజైన్ కార్మికుల పాలిట శాపంగా మారిందని చెప్పవచ్చు. వారు సొరంగంలో ఇరుక్కుని దాదాపు 96 గంటల సమయం అవుతోంది. శనివారం ఉదయం 8:30 గంటలకు ప్రమాదం జరుగగా, ఎనిమిది మంది అక్కడే చిక్కుకుపోయారు. వారున్న వైపు గ్యాప్ ఉన్నా.. ఊపిరి తీసుకోవడానికి గాలి వెళ్తుందా? లేదా? తాగునీరు ఉందా? అనేది సమస్య. ఇటువైపు నుంచి సహాయక బృందాలు వెళ్లడానికే జంకుతున్న పరిస్థితి ఉంది. అలాంటిది ప్రమాదం జరిగిన ప్రాంతంలో దాదాపు 40 మీటర్లు సంక్లిష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో వారి జాడ కనిపించక కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు.


రెస్క్యూ సిబ్బంది కోసం సిద్ధం చేసిన ఆహారం


రెడీగా ఉంచిన ఆక్సిజన్ సిలిండర్లు


టన్నెల్ ముందు భాగం

రూ.1,003 కోట్లతో
ఉపాధి హామీ ప్రణాళిక

- 2 కోట్ల పనిదినాలు కల్పనే లక్ష్యం
- 2025-26 జాబితా సిద్ధం
- గ్రామసభల ద్వారా పనుల గుర్తింపు
- నిర్దేశించిన పనులకే ప్రాధాన్యం
- ఒండ్రుమట్టి తరలింపు, కందకాల, ఫాపాండ్ తవ్వకం, షెడ్ల నిర్మాణం


ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వలసలు నివారించి, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న చోటే పని కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వచ్చే సంవత్సరం నిర్వహించే పనుల ప్రణాళికను ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. గ్రామాల వారీగా ఉన్న జాబ్‌కార్డుల్లోని ఆక్టివ్ కూలీలకు ఏడాదిలో వంద రోజుల ఉపాధి కల్పనే లక్ష్యంగా పని దినాలను రూపొందించారు. గతేడాదికన్నా ఎక్కువ మందికి, ఎక్కువ రోజులు పనులు కల్పించాలని ప్రణాళిక తయారు చేశారు. ఉమ్మడి ఐదు జిల్లాలోని గ్రామాల వారీగా పని దినాలు, మెటీరియల్ పేమెంట్ అంచనాలను రూపొందించారు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్‌లో అధిక పని దినాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయగా, గద్వాల జిల్లా చివరి వరుసలో ఉంది. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి 31 నాటికి ఈ క్యాలెండర్‌ను తయారుచేశారు.

కూలీలకు 2 కోట్ల పనిదినాలు

ఉమ్మడి జిల్లాలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రెండు కోట్లా 65 వేలా 332 పని దినాలు కల్పించాలని నిర్దేశించారు. ఒక్కో కూలీ కొలతల ప్రకారం పనిచేస్తే రోజూ రూ.300 కూలి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో రూ.601,96,29,600 నిధులను లేబర్‌కు ప్రతిపాదించారు. మరో 40 శాతం మెటీరియల్ పేమెంట్‌కు రూ.401,37,00,000 కోట్లను ఇందుకోసం వెచ్చించనున్నారు. అంటే వచ్చే ఆర్థిక సంవత్సరం పథకం ద్వారా వెయ్యి కోట్ల రూపాయల విలువ గల పనులను చేపట్టేందుకు యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే అన్ని గ్రామాలలో సభల ద్వారా చేపట్టాల్సిన పనులను ఆమోదించారు. ఏప్రిల్ నుంచి పనులు మొదలు కానున్నాయి.

ఈ ఏడాది చేపట్టాల్సిన పనులు

పథకంలో ఇదివరకు చేసినట్లుగా ఇష్టానుసారంగా పనులను మార్చి ఉపాధి నిధులు వెచ్చించడానికి వీలు లేదు. కేంద్రం నిర్దేశించిన పనులను మాత్రమే చేపట్టాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ పనులు, వ్యవసాయదారులకు ప్రయోజనం కలిగించే, బీడు భూములను సాగులోకి తేవడమే లక్ష్యంగా పనుల జాబితాను తయారు చేశారు. కందకాలతో నీటిని ఒడిసిపట్టే, పల్లం వైపు నీరు వెళ్ళకుండా బండింగ్ పనులు, నీటి నిలువ కోసం ఫారంపాండ్, చెరువుల్లో నీటి నిలువ కోసం పూడికతీత, భూమిని సారవంతం చేసేందుకు ఒండ్రుమట్టి తరలింపు, వ్యవసాయ యోగ్యం కాని భూములను సాగులోకి తెచ్చేందుకు భూ అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. వాటితో పాటు పశువులు, గొర్రెలు, మేకల కోసం షెడ్లను నిర్మించాల్సి ఉంది. ఇక మెటీరియల్ కాంపోనెంట్ కింద సీసీ రోడ్లు వేయనున్నారు.

పాత పనులు పూర్తి చేస్తేనే కొత్తవి

పథకంలో పాత పనులు పూర్తి చేస్తేనే కొత్త పనులు చేపట్టేలా చర్యలు తీసుకోనున్నారు. ఇదివరకు ఇష్టానుసారంగా ఓ పని మొదలుపెట్టి అది పూర్తికాకుండా మరో పనిచేపట్టేవారు. ఇప్పుడు 30 శాతం పనులు చేస్తే.. అవి పూర్తయ్యే దాకా ఇతర పనులు మొదలు పెట్టే అవకాశం ఉండదు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఆరుగురు విద్యార్థులు, డ్రైవర్‌కు గాయాలు

దామరగిద్ద, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో లారీ, ఆటో ఢీకొన్న ఘటనలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు గాయాలైన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలలో చదవుతున్న విద్యార్థులు పాఠశాల ముగించుకొని సాయంత్రం మద్దెల్‌బీడ్‌కు ఆటోలో వెళ్తున్న సమయంలో నారాయణపేట నుంచి దామరగిద్ద వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఆటోలో ఉన్న ఆరుగురు విద్యార్థులకు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వెంటనే నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. గాయాలైన విద్యార్థులలో ఈశ్వర్ కాలుకు తీవ్ర గాయమైంది. మిగతా విద్యార్థులు నితిన్, కీర్తన, సిద్దార్థ, చరణ్, మహేశ్వరితో పాటు డ్రైవర్ తలకు, చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం ముగ్గురు విద్యార్థులను, డ్రైవర్‌ను మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు పరిశీలించి లారీని స్టేషన్‌కి తరలించారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ధన్వాడ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): హర్యాన నెట్‌బాల్ సంఘం, జాతీయ నెట్‌బాల్ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కొండాపూర్ విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టు తరఫున కొండాపూర్ గురుకులంలో చదువుతున్న బాల్‌రాజు, రాజేష్ ఆడనున్నారు. అలాగే మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించే జూనియర్ మిక్స్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు త్రిశాంత్, హరీశ్ ఎంపికయ్యారు. విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ రామ్మోహన్‌గౌడ్, పీఈటీ అంజనేయులు అభినందించారు.

పెరటి తోటలపై అవగాహన



కూరగాయల విత్తనాలను అందజేస్తున్న ప్రభాకర్ రెడ్డి

బిజినేపల్లి/మన్ననూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ పద్ధతిలో పెరటి తోటలు పెంచుకుంటే నాణ్యమైన కురగాయలను ఆహారంగా తీసుకోవచ్చునని కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో మంగళవారం పెరటితోటల పెంపకంపై అవగాహన కల్పించారు. బజారులో కొనుగోలు చేసే కూరగాయల సాగులో అధిక రసాయనాలు వాడటం వల్లన కలుషితమవుతున్నాయని తెలిపారు. వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా మనం అనారోగ్యం పాలవుతున్నామని వివరించారు. సేంద్రియ పద్ధతిలో పెరట్లో కూరగాయలు సాగుచేసుకుంటే ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవచ్చునని వివరించారు. అనంతరం పెరటి తోటల పెంపకం కోసం పది రకాల కూరగాయల విత్తనాల ప్యాకెట్లను అందజేశారు. అదేవిధంగా మన్ననూర్ మండలంలోని మల్లాపూర్, అప్పాపూర్, మేడిమాల్కల, భౌరాపూర్, సంగిడి గుండాల తదితర పెంటల్లో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో కూరగాయల విత్తనాల ప్యాకెట్లను ఆర్డీటీ ఏరియా బృందం నాయకుడు రామ్మోహన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రాజశేఖర్, రామకృష్ణ ఉన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం


మల్లు భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మన్ననూర్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మన్ననూరు అటవీ అతిథి గృహం వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉదయం ఘన స్వాగతం పలికారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల సహాయక చర్యల పరిశీలన నిమిత్తం దోమలపెంట వెళ్తున్న ఆయనను కాంగ్రెస్ నాయకులు కలిసి స్వాగతించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినారాయణ, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం, నాయకులు తుల్యానాయక్, యశ్వంత్, శంకరయ్య, రాజేంద్రప్రసాద్, మేరాజ్, జూలూరి సత్యనారాయణ, బాలు, శివాజీ, బాలస్వామి పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కేసరి సముద్రంలో గుర్తు తెలియని శవం ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన వారాల చంద్రమ్మ(37)గా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 23న ఇంటి నుంచి ఆసుపత్రికి వెళ్తానని చెప్పి వచ్చిన చంద్రమ్మ నాగర్‌కర్నూల్ కేసరి సముద్రంలో శవమై తేలినట్లు ఆయన తెలిపారు. మృతురాలి భర్త వారాల కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్తీకి అడ్డా..

- గద్వాల జిల్లాలో జోరుగా కల్తీ ఆహార పదార్థాల తయారీ



పట్టుబడిన నిందితులతో పోలీసులు (ఫైల్)


గద్వాల జిల్లా కేంద్రంలోని గంజిపేటకాలనీలో పోలీసులు పట్టుకున్న కల్తీ ఆహార పదార్థాలు (ఫైల్)

గద్వాల క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం కల్తీ ఆహారపదార్థాలకు అడ్డాగా మారింది. పర్యవేక్షించాల్సిన అధికారి పట్టించుకోకపోవడంతో తయారీ దారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని గంజిపేట, కుంటవీధి కాలనీలలో ఏళ్ల తరబడి కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టును తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇటీవల పోలీసులు గుర్తించి తయారీదారులను అదుపులోకి తీసుకున్నారు. గతంలో ట్రైనీ డీఎస్పీగా ఖాదర్‌బాషా బాధ్యతలు చేపట్టిన సమయంలో కుంటవీధిలోని ఓ కిరాణ దుకాణ యజమానిని అదుపులోకి తీసుకొని అతడి నుంచి క్వింటాళ్ల కొద్ది అల్లం వెల్లుల్లి పేస్టు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అయన వెళ్లిపోయాక ఓ పోలీస్ అధికారి ఆ కిరాణ యజమానిని ఈ కేసు నుంచి తప్పించిన విషయం అప్పట్లో చర్చనీయంగా మారింది. గతనెలలో గంజిపేట కాలనీలోని సితార ఇండస్ట్రియల్‌లో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారు చేస్తున్నారని సమాచారం రావడంతో పట్టణ ఎస్‌ఐ తనిఖీలు చేసి 250 కేజీల కల్తీ ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఐదుగురిపై కేసు కూడా నమోదు చేశారు. వీటితో పాటు జిల్లాలో అయిజ కేంద్రంగా నకిలీ వంటనూనె దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు సన్‌ఫ్లవర్ అయిల్‌లో పామాయిల్‌ను కలపడం, పసుపు, కారం, నువ్వుల పొడులు, అల్లం వెల్లుల్లి పేస్టును కల్తీచేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఈ కల్తీ వ్యాపారులకు అండగా ఓ మాజీ ప్రజాప్రతినిధి ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా నాలుగేళ్లుగా జోగుళాంబ గద్వాల జిల్లాకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కనిపించడం లేదని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభం..

కల్తీ ఆహార పదార్థాల తయారీకి తక్కువ పెట్టుబడితో అధిక లాభం వస్తుండటంతో నిర్వాహకులు ఈ వ్యాపారాన్ని ఎంచుకున్నారు. అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీలో వెల్లుల్లి పొట్టు, యాసిడ్, కొన్ని రసాయనాలతో పేస్టును తయారీ చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరి తక్కువ ధరకే తయారు చేస్తూ షాపులకు కేజీ రూ.100 చొప్పున సరఫరా చేస్తుంటే దుకాణదారులు కేజీ రూ.250 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అదే బ్రాండెడ్ అయితే అంతలాభం ఉండదు కాబట్టి దుకాణదారులు కూడా ఎక్కువగా వీటినే ప్రజలకు అంటగడుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు

జిల్లాలో కల్తీ ఆహారపదార్థాల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని కల్తీ ఆహారపదార్థాల తయారీదారులపై నిఘా ఉంచాం. వాహన తనిఖీలు, అనుమానం ఉన్న కొన్ని దుకాణాలను సైతం తనిఖీ చేస్తున్నాం. వీటి తయారీలో ఎవరు ఉన్నా ఊపేక్షించేదిలేదు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

- టంగుటూరి శ్రీను, సీఐ

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన వివాహిత (27) కన్పించడం లేదని ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ నెల 23న మహిళ తన కూతురును తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయిందని, బంధువుల దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'చెరకు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

అమరచింత, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధర లేక, ఆశించిన మేర పంట చేతికి రాక చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్‌తో కలిసి కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చెరకు కటింగ్ పూర్తయి 40 రోజుల గడుస్తున్నా.. ఫ్యాక్టరీ యజమానులు రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ యజమానులు డబ్బులు ఆలస్యం చేస్తే 16 శాతం వడ్డీతో రైతులకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌కు అందజేశారు.

జనరేటర్‌కు
చీర చుట్టుకొని మహిళ మృతి


బుజ్జి (ఫైల్)

ఉప్పునుంతల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పెండ్లి ఊరేగింపులో డీజే జనరేటకు చీర చుట్టుకొని మహిళ మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని ఈర్వటోనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పూర్యానాయక్ తండాకు చెందిన జర్పుల వెంకట్రాం అతని భార్య బుజ్జి (35) సోమవారం ఈర్వటోనిపల్లి గ్రామంలోని వారి బంధువుల పెళ్లి వేడుకలకు హాజరయ్యారు. రాత్రి పెళ్లి ఊరేగింపు బుజ్జి చూస్తుండగా ప్రమాదవశాత్తుగా డీజే జనరేటర్ ఫ్యానుకు ఆమె చీర చుట్టుకొని తలకు, మెడకు, శరీరభాగాలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే వెల్దండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మార్గమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. భర్త వెంకట్రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేనేత పొదుపు నిధి
దరఖాస్తుల పరిశీలన


రాజోలి వీవర్స్ కాలనీలో మగ్గాలను పరిశీలిస్తున్న నల్లగొండ జిల్లా ఏడీవో గోపాల్

గద్వాల టౌన్/రాజోలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పొదుపు నిధి (త్రిఫ్ట్ ఫండ్) పథకం దరఖాస్తులకు సంబంధించి అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. హైదరాబాద్. నల్గొండ, జనగాం నుంచి వచ్చిన తొమ్మిది మంది అధికారులు పట్టణంలోని జియోట్యాగింగ్ చేసిన మగ్గాలను పరిశీలించారు. గద్వాల పట్టణంతో పాటు జిల్లాలోని రాజోళి, అయిజ, ఎక్లాస్‌పూర్, అలంపూర్, గట్టు, మాచర్ల, ఆరగిద్ద, గోర్లఖాన్‌దొడ్డి, మల్దకల్, కురవపల్లి, నాగర్‌దొడ్డి, కాకులారం, బూడిదపాడు గ్రామాల్లోని కార్మికుల ఇళ్ల వద్దకు వెళ్లి దరఖాస్తు పరిశీలన జరిపినట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య తెలిపారు. రాజోలిలోని వీవర్స్‌కాలనీ, క్యాషియర్ ప్లాట్లు, కోటవీధిలో మగ్గాలను పరిశీలించారు. కార్యక్రమంలో నల్లగొండ ఏడీవో గోపాల్, టెస్కో జేడీవోలు ప్రభాకర్, సతీష్, క్లస్టర్ సీడీఈలు శివశంకర్, సాకేత్, శివమణి పాల్గొన్నారు.

స్కూల్ అటెండర్‌ను
పరామర్శించిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్ల గ్రామ జడ్పీహెచ్ఎస్ స్కూల్ అటెండర్ మారేడు గాలెమ్మ భర్త మారేడు చెన్నయ్య పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మంగళవారం వారి స్వగృహానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట మాజీ సర్పంచ్‌లు వీ సత్యం, పగడాల చిన్నయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య, మాజీ వార్డు సభ్యులు భైరాముడు, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫైనాన్స్ డబ్బు చెల్లించలేక
వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- శాంతినగర్‌లో ఘటన

వడ్డేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి పట్టణంలోని శాంతినగర్‌లో మంగళవారం ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కార్యాలయం ఎదుట క్యాతూరుకు చెందిన నర్సింహులు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడిన వ్యక్తిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫైనాన్స్ డబ్బులు కట్టమన్నందుకు సదరు వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బ్యాంక్ మేనేజర్ సతీష్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డిని సంప్రదించగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్ద పూర్తి సమాచారం సేకరణ కోసం ఏఎస్‌ఐను పంపామని తెలిపారు.

ఓం నమః శివాయ



ఓం మహేశ్వరాయ నమః.. ఓం ఈశ్వరాయ నమః.. ఓం హరాయ నమః.. ఓం త్రిపురాంతకాయ నమః.. ఓం భవాయ నమః.. మంత్రోచ్చారణలతో శివాలయాలు మారుమోగనున్నాయి. శివనామ స్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించనున్నాయి. బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని పరమేశ్వరుడికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అందుకోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాల్లో నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

- నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

» నేడు మహాశివరాత్రి పర్వదినం » ప్రముఖ శైవక్షేత్రాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రకృతి ఒడిలో పరమేశ్వరుడు



ఆలయానికి మామిడి తోరణాలు కడుతున్న నిర్వాహకులు

అచ్చంపేట టౌన్ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ క్షేత్రం ఉమామహేశ్వరంలో స్వామి వారు ప్రకృతి ఒడిలో కొలువుదీరి భక్తుల పూజలందుకుంటున్నారు. క్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, మామిడి, పూల తోరణాలతో అలంకరించారు. బుధవారం ఉదయం చండీహోమం, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. దిగువనున్న బోగమహేశ్వరం వరకే ప్రైవేటు వాహనాలను అనుమతిస్తున్నట్లు చెప్పారు. కొండ పైకి వెళ్లేం దుకు నాలుగు ఆర్టీసీ బస్సులను నడుపనున్నట్లు డిపో మేనేజర్ ప్రసాద్ తెలిపారు. రాత్రి జాగారం ఉండే భక్తులను అలరించేందుకు చిన్నారుల నృత్య ప్రదర్శనతో పాటు, అమ్రాబాద్, పదర మండలాలు చెందిన కళాకారులతో కోలాట ప్రదర్శన, భజన, సంకీర్తన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి లింగోద్భవం, శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటాయని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

కోటిలింగేశ్వరుడికి కోటి దండాలు



ఊకశెట్టివాగులోని 36 అడుగుల శివుడి విగ్రహం

కొత్తకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట మండలంలోని కానాయపల్లి, పామాపురం గ్రామాల్లోని కోటిలింగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రామేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ఊకశెట్టివాగులో ఉన్న 36 అడుగుల శివుడి విగ్రహం, కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగానికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్ (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు శ్రీశైల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. మహబూబ్‌నగర్ డిపోతో పాటు రీజియన్‌లోని వనపర్తి, నారాయణపేట, షాద్‌నగర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట డిపోల నుంచి 50 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ఐదు గంటల నుంచి బస్సు సర్వీసులు ప్రారంభం అవుతాయి. మహబూబ్‌నగర్ డిపో నుంచి మంగళవారం సాయంత్రం వరకు 16 ప్రత్యేక బస్సులను శ్రీశైలానికి నడుపుతున్నారు. భక్తుల రద్దీని బట్టి ఎక్కువ బస్సులను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

నల్లమలలో చెంచుల జాతర

» భౌరాపూర్ క్షేత్రంలో భ్రమరాంబిక, మల్లికార్జునుల కల్యాణోత్సవం » ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి

మన్ననూర్ (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శైవక్షేత్రం భౌరాపూర్‌లో చెంచుల జాతరను ఘనంగా నిర్వహించ నున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున నిర్వహించనున్న ఈ జాతరకు ఆరు జిల్లాల నుంచి చెంచులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న కల్యాణోత్సవంలో పాల్గొననున్నారు.



భౌరాపూర్‌లోని భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయం

రూ. 12 లక్షలు కేటాయింపు

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే చెంచుల జాతరకు ప్రభుత్వం రూ.12 లక్షలు కేటాయించింది. వారం రోజుల క్రితమే కలెక్టర్ బదావత్ సంతోష్ బౌరా పూర్ ఆలయాన్ని సందర్శించి ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నల్గొండ, నాగర్‌కర్నూల్, పరిగి, వికారాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల నుంచి చెంచులు వచ్చేందుకు 14 బస్సులను మూడు ట్రిప్పులు నడుపనున్నారు. జాతరకు వచ్చే చెంచుల కోసం తాగనీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాత్కాలిక స్నానపు గదులను ఏర్పాటు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల వార్డెన్ల నేతృత్వంలో భక్తులకు టిఫిన్, భోజన సదుపాయాలను కల్పించనున్నారు. కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికా రులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వారం దరూ ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకు పోయిన కార్మికుల రక్షణ సహాయ చర్యల్లో బిజీగా ఉన్నారు. అక్కడి పరిస్థితులను బట్టి వారు ఉత్సవాలకు హాజరయ్యేది లేనిదీ స్పష్టత లేదని అధికారులు చెప్తున్నారు.

వాహనాలకు ఒక రోజు అనుమతి

మహాశివరాత్రి సందర్భంగా భౌరాపూర్ ఆలయ సందర్శనకు వచ్చే భక్తుల వాహనాలకు బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా అనుమతి ఇస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు ప్రకటించారు. నిర్వహణ ఖర్చుల నిమిత్తం ద్విచక్ర వాహనానికి రూ.40 ఆటోలకు రూ.300. కార్లకు రూ.500 చొప్పున టోల్‌గేట్ చార్జీని వసూలు చేయనున్నట్లు తెలిపారు. అటవీ మార్గంలో ప్రయాణం చేసేటప్పుడు వాహనాల హారన్ శబ్దాలు లేకుండా వెళ్లాలని, సిగరెట్, బీడీలు కాల్చడం పూర్తి నిషేధమని ప్రకటించారు. ప్లాస్టిక్ వస్తువులను తీసుకురావొద్దని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

మూడు రోజుల పాటు ఉత్సవాలు

భౌరాపూర్ క్షేత్రంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో చెంచులు సంప్రదాయ నృత్యాలు, పాటలు పాడుతారు. 26వ తేదీ తెల్లవారుజామున భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు తోకల గురువయ్య ఆధ్వర్యంలో అప్పాపూర్ నుంచి భౌరాపూర్ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొస్తారు. ముందుగా ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించి, ఆలయ ప్రాంగణంలో చెంచు పూజారుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, కల్యాణ క్రతువు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా చెంచులు తమ సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవిస్తారు. మూడవ రోజు గురువారం శాంతి పూజతో ఉత్సవాలు ముగియనున్నాయి.

వాడవాడనా మహాశివుడు



నారాయణపేటలోని ఔదుంబర్ కొండుల్లోని శివాలయం

నారాయణపేట, దామరగిద్ద (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట పట్టణంలో వాడవాడనా మహాశివుడు కొలువుదీరి ఉన్నాడు. బారంబావిలో మనోహర లింగేశ్వరుడు, గాంధీనగర్‌లో లింగయ్య, శివాజీనగర్‌లో శివలింగేశ్వర ఆలయాలున్నాయి. అలాగే మహంకాళీ వీధిలో శివాలయం, లోకాయిపల్లి సంస్థానంలో ఔదుంబరేశ్వర దేవాలయం, భైరంకొండ, కోటకొండ శివారు లోనూ ఈశ్వరాలయాలు ఉన్నాయి. ఈ ఆలయాల్లో మహా శివరాత్రి పర్వ దినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పళ్ల బురుజు శ్రీలక్ష్మీ గణపతి ఉమామహేశ్వర ఆలయ ప్రాంగణంలో దీక్షిత్ కుటుంబీకుల అధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మహాగణపతి ఫౌండేషన్ చైర్మన్ దిలిప్‌కుమార్ దీక్షిత తెలిపారు.

మాణిక్యగిరి క్షేత్రంలో..

నారాయణపేట జిల్లా సరిహద్దు, కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా, సేడం తాలుకా, యానగుంది మాణిక్యగిరి క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రస్టు కార్యదర్శి శివయ్యస్వామి తెలిపారు. బుధవారం ఉదయం మహా రుద్రాభిషేకం, పాదుకాపూజ, మధ్యాహ్నం 12 గంటలకు మాణికేశ్వరి మాత సన్నిధిలో శివ రాత్రి ఉత్సవం నిర్వహించనున్నారు. గురువారం రాత్రి మహా రథోత్సవం, శుక్రవారం ఉదయం పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి.

గుండాలలో నేటి నుంచి ఉత్సవాలు



గుండాల గ్రామంలోని అంబా రామలింగేశ్వర స్వామి ఆలయం

వెల్దండ (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వెల్దండ మండల కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండాల గ్రామంలో ఉన్న ఈ ఆలయాన్ని త్రేతాయుగంలో నిర్మించినట్లు పురాణ కథనం. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి వచ్చేనెల 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ మల్లేపల్లి సందీప్‌రెడ్డి తెలిపారు. 26న స్వామి వారికి ఉదయం రుద్రాభిషేకం, రాత్రి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. వచ్చేనెల రెండున పుష్ప రథోత్సవం (చిన్న తేరు), 4వ తేదీన పెద్ద రథోత్సవం ఉంటాయి. 5వ తేదీన స్వామి, అమ్మవార్లకు వృషభ వాహన సేవ, ఆరున హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించనున్నారు. 12వ తేదీన వడిబియ్యం, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



తిరుమల్ (ఫైల్)

అయిజ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణానికి చెందిన లైన్‌మన్ తిరుమల్ (34) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆయన అయిజ సబ్‌స్టేషన్ పరిధిలోని బంగిదొడ్డిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ఎక్లాస్‌పూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

నవాబ్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని పోమాల గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యం అయినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటమ్మ చిన్న కూతురు వనజకు, జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన బండపల్లి లక్ష్మయ్యతో 13 సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 23న వనజ తల్లిగారి ఊరు పోమాలకు వచ్చింది. రాత్రి కుటుంబసభ్యులందరూ నిద్రపోయిన తరువాత ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. 24న తెల్లవారుజామున నాలుగు గంటలకు కుటుంబ సభ్యులు లేచిచూడగా ఆమె కన్పించలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంగాపూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల రాజుపై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ పై దాడి, కేసు నమోదు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసినట్లు నవాబ్‌పేట ఎస్ఐ విక్రం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండల కేంద్రానికి చెందిన ఎరుకలి రాజు కొంతకాలంగా మహబూబ్‌నగర్ డిపోలో అద్దె బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటల సమయంలో మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేటకు బస్సు తీసుకొచ్చారు. పోలీస్‌స్టేషన్ వద్ద బస్సు మలుపుతుండగా, ఎదురుగా వస్తున్న ఓమినీ వ్యాన్ వెనుక భాగంలో తగిలింది. దీంతో వ్యాన్ డ్రైవర్ నాని, మరో డ్రైవర్ అశోక్‌లు ఆగ్రహంతో రాజుపై రాయితో దాడి చేసి, గాయపరిచారు. దీంతో బాధితుడు రాజు ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మద్దూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మద్దూరు మండలంలోని కాజీపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం కాజీపూర్ గ్రామానికి చెందిన కాన గడ్డ జములప్ప ఇంట్లో పోలీసులు తనిఖీ చేశారు. అతడి ఇంట్లో దాదాపు 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లై అధికారుల పంచనామా అనంతరం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

దక్షిణకాశీలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

» తొలిరోజు యాగశాల ప్రవేశం, త్రిశూల పూజలు

అలంపూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలోని బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ధ్వజ మండపం వద్ద గోమాత పూజలు చేశారు. అమ్మవారికి మంగళద్రవ్యాలు, పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి, శివ సంకల్పం పఠించి బలిబేరం, త్రిశూల పూజలు చేశారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, ఋత్విక్వరణ కార్యక్రమాలతో అర్చకులు ఆరంభ పూజలు చేశారు. ఆయా దేవతలకు షోడశోపచార పూజలు చేశారు. ఆ తర్వాత బ్రహ్మేశ్వర ఉద్యానవనం నుంచి పుట్టమట్టిని తీసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి యాగశాలకు తీసుకొచ్చారు. పాలికలలో పుట్టమట్టిని నింపి, పాలతో తడిపిన నవధాన్యాలను వేశారు. మంత్ర పూర్వక జలాన్ని అబిమంత్రిస్తూ వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ వరుణ పూజలు చేశారు. అగ్ని ప్రతిష్ఠాపనతో యాగశాలలో హోమాలను ప్రారంభించారు.

ధ్వజారోహణంతో దేవతాహ్వానం

వేదమంత్రోచ్చారణతో, భేరి తాళనం చేస్తూ దేవతలను ఆహ్వానించారు. అనంతరం మంగళాష్టకం పఠిస్తూ నంది కేతనాన్ని ధ్వజం పైకి ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, ధర్మకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చైర్మన్ కొంకల నాగేశ్వర్‌రెడ్డి, భక్తులు

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

» కుమార్తెను పాఠశాల నుంచి తీసుకొచ్చేందుకు వెళ్లిన దంపతులు » ఇంటికి తిరిగి వచ్చే సరికి సంఘటన

» 5 తులాల బంగారం, రూ. 10 వేల నగదును ఎత్తుకెళ్లిన దొంగలు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి, తమ కుమార్తెను పాఠశాల నుంచి తీసుకొచ్చేలోగా దొంగలు చొరబడి బంగారంతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన ఆనందమ్మ, ఆమె భర్త డీఆర్‌డీఏలో పని చేస్తున్నారు. వారి కుమార్తె గద్వాల మండల పరిధిలోని వీరాపురంలోగల ఓ ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. కుమార్తెను తీసుకొచ్చేందుకు మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఇంటికి తాళం వేసి, ఇద్దరూ కలిసి పాఠశాలకు తిరిగివెళ్లారు. కుమార్తెను తీసుకొని 5 గంటలకు ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళం విరగొట్టి, తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళనకు గురై లోపలికి వెళ్లి చూశారు. బీరువాలోని 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ. 10 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్, సీఐ శ్రీను సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీంను పిలిపించి ఆనవాళ్లను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ కల్యాణ్‌కుమార్

జడ్చర్లలో బిహార్ యువకుడి హత్య

» బాత్‌రూమ్‌లో పడి ఉన్న మృతదేహం

జడ్చర్ల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలో బిహార్‌కు చెందిన ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రంలోని కుచ్చతానారోటన్ జిల్లా, మౌన పోస్ట్, రాంపూర్ బరేత గ్రామానికి చెందిన రషీద్‌ఖాన్ (26) జడ్చర్ల మండలంలోని పెద్దపల్లి సమీపంలోగల ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. పట్టణంలోని బీఆర్ రెడ్డి గార్డెన్స్ ఫంక్షన్‌హాల్ మొదటి అంతస్తులోని గదులలో మరికొందరు కూలీలతో కలిసి ఉంటున్నాడు.

సోమవారం అర్ధరాత్రి తాను ఉంటున్న గదిలో హత్యకు గురయ్యాడు. అతడి మృతదేహం బాత్‌రూమ్‌లో పడి ఉంది. అతడి తల, నుదిటిపై గాయాలున్నాయి. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. జడ్చర్ల సీఐ కమలాకర్, ఎస్ఐలు మల్లేష్, జయప్రసాద్‌లు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రషీద్‌ఖాన్ మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిశ్రమ లేబర్ సూపర్‌వైజర్ రమాకాంతస్వాయన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

నేడు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

» అసోసియేషన్ అధ్యక్షుడు అహ్మద్‌జాకీర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : బాస్కెట్‌బాల్ జిల్లా జట్లను బుధవారం ఎంపిక చేయనున్నట్లు బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుదుచ్చేరి రాష్ట్రంలో ఏప్రిల్ 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న 40వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టు ఎంపికకు సెలక్షన్ కమ్ ట్రయల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో చైర్మన్ మీర్ అర్షద్‌అలీ, ప్రధాన కార్యదర్శి నసూరుల్లా హైదర్ మహ్మద్, వైస్ ప్రెసిడెంట్ సుబాహన్‌జీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్‌ఖలీద్‌అలీ, అసోసియేట్ సెక్రటరీ మీర్ అర్షద్‌అలీ, జాయింట్ సెక్రటరీలు మహ్మద్ ఇలియాజ్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మక్సూద్‌బిన్ అహ్మద్‌జాకీర్, పాల్గొన్న అర్షద్‌అలీ, మహ్మద్ ఇలియాజ్, గోపాలకృష్ణ

న్యూస్ బాక్స్

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

అయిజ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం అయిజ మండల విద్యాధికారి రాములుకు బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ పల్లయ్య వినతిపత్రం అందజేశారు. పాఠశాల బస్సుల్లో పరిమితికి మించి పిల్లలను చేరవేస్తూ, వసతులు తక్కువతో అధికఫీజు వసూలు చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వీరేష్ పాల్గొన్నారు.

అంతర్గత మార్కుల ర్యాండం పరిశీలన



గోన్‌పాడులోని కేజీబీవీలో మార్కులను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్జేడీ ఆదేశాల మేరకు పదో తరగతి అంతర్గత మార్కుల ర్యాండం పరిశీలనలో భాగంగా ప్రత్యేక బృంద సభ్యులు మంగళవారంగద్వాల శివారులోని గోనుపాడు కేజీబీవీ, నోబుల్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్దీత అంతర్గత 20 మార్కులకు వేసిన మార్కులను నిశితంగా పరిశీలించారు. ప్రతిభ, అభ్యసనా సామర్థ్యాలు తదితర అంశాల ఆధారంగా వేసిన వివరాలపై ఆరా తీశారు. డీసీఈబీ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మహేష్ పాల్గొన్నారు.

నాణ్యతతో మెనూ ప్రకారం భోజనం అందించాలి

● ఎంపీడీవో మంజుల



ధరూర్ బాలుర వసతిగృహంలో సరకులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ధరూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మెనూప్రకారం నాణ్యతతో భోజనం అందించాలని ఎంపీడీవో మంజుల హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. మంగళవారం ధరూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఎంఈవో రవీంద్రబాబుతో కలిసి ఎంపీడీవో సందర్శించారు. ముందుకు వసతి గృహంలోని స్టోర్ రూంలో ఉన్న సరకులను, కిచెన్ రూంతో పాటు పలురిజిస్టర్లను పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మహిళా సాధికారత సభ్యులు

అయిజ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రమాదకర వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు సూచించారు. మండలంలోని ఉత్తనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం బేటీ బచావో, బేటీపడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మహిళా సాధికారత సభ్యులు సరోజ, చిట్టెమ్మ, శోభ మాట్లాడారు. లిగనిర్ధారణ పరీక్షలు చట్టరీ త్యానేరం అని తెలిపారు. హెల్ప్‌లైన్, ఉమెన్ హెల్ప్‌లైన్, లైంగిక వేధింపుల నిరోధక చట్టం, ఉన్నత విద్య గురించి వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసాచారి, హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన



మాన్‌దొడ్డిలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

రాజోలి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాన్‌దొడ్డిలో ప్రాథమిక పాఠశాల-1లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా ధనలక్ష్మి, కలెక్టర్‌గా జహీర్ భాష, డీఈవోగా మానస, ఎంఈవోగా శశికుమార్ వ్యవహరించారు.

లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలి

- ఇటిక్యాల ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ - చేపట్టిన ఉపాధి పనులు, నిధుల ఖర్చుపై ఆరా



ఇటిక్యాల ఎంపీడీవో కార్యాలయంలో ఇంకుడుగుంత పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ఇటిక్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇటిక్యాల ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడాలన్నారు. పథకం కింద మంజూరైన పనులకు సంబంధించి పనుల అమలు, చెల్లింపు వివరాలను సమీక్షించి అన్ని వివరాలు కచ్చితంగా ఉండాలని ఆదేశించారు. హరితహారం కింద నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కల వివరాలు, వాటి నిర్వహణకు జరిగిన ఖర్చులను సమీక్షించారు. ఉపాధి హామీ నిధుల్లో 60శాతం వ్యవసాయ అనుబంధ పనులకు కేటాయించాలన్నారు. మస్టర్‌రోల్‌ను పరిశీలించి అన్ని రిజిస్టర్లు స్పష్టంగా నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, పనుల పురోగతికి చెందిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాల పెంపుదల కోసం రూ.30వేలతో నిర్మిస్తున్న ఇంకుడుగుంతలను పరిశీలించి పనుల నాణ్యతపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌నర్సింగరావు, ఎంపీడీవో అజహర్‌మొహిముద్దీన్, ఏపీవో శివజ్యోతి, టీఏలు కృష్ణయ్య, లావణ్య, హుసేన్ పాల్గొన్నారు.

● ఉపాధి కల్పనకు నైపుణ్య ప్రణాళిక

గద్వాల న్యూటౌన్ : జిల్లాలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వృత్తి నైపుణ్య అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాలను గుర్తించి ఆ రంగాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని స్కిల్ ట్రైనింగ్ సెంటర్లు అందిస్తున్న కోర్సుల వివరాలను సేకరించి, ఒక వారంలో నివేదిక సమర్పించాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారికి ఆదేశించారు. యువత ఏయే నైపుణ్యాలపై ఆసక్తి కలిగి ఉన్నారో గుర్తించి వారి జాబితా సిద్ధం చేయాలని డీఆర్‌డీవోకు ఆదేశించారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంపిక చేయాలని, సంబంధిత అన్ని శాఖలు తమ పరిధిలో ఆసక్తి ఉన్న అభ్యర్థులను గుర్తించి వారికి శిక్షణ కార్యక్రమాలను రూపొందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎంప్లాయిమెంట్ అధికారి డాక్టర్ ప్రియాంక, జీ.ఎం. ఇండస్ట్రీస్ రామలింగేశ్వర్‌గౌడు, ఎల్‌డీఎం అయ్యపురెడ్డి, బీసీ సంక్షేమాధికారి రమేష్‌బాబు, ఎస్సీ సంక్షేమాధికారి సరోజ, జిల్లా అధికారులు ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఐఏసీఈ ప్రతినిధి నాగేశ్వరరెడ్డి

గద్వాల సర్కిల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ల ద్వారా ప్రకటించే వివిధ రంగాల ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ అకాడమీ ఫర్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ (ఐఏసీఈ) హైదరాబాద్ ప్రతినిధి నాగేశ్వరరెడ్డి సూచించారు. గద్వాలలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై కళాశాల ప్రిన్సిపాల్ మీనాక్షి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రతినిధి విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతూ డిగ్రీ చదువుతూనే ఉద్యోగ అన్వేషణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం డిగ్రీ అర్హతతో జాతీయ స్థాయిలో స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, బ్యాంకు, రైల్వే ఉద్యోగాల భర్తీ కొరకు నోటిఫికేషన్ జారీ చేస్తుందని వివరించారు. ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఏకాగ్రత, పక్కా ప్రణాళిక, పోటీతత్వం ఉంటే ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ మీనాక్షి మాట్లాడుతూ చదువుతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలంటే పోటీ పరీక్షలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ సమన్వయకర్త సమత, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులకు నిధులు మంజూరు చేయిస్తా

● ఎంపీడీవో రామకృష్ణ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు ఎవరైనా ముందుకు వస్తే నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మంగళవారం వడ్డేపల్లి మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పాఠశాలల్లో చిన్నపాటి పనులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో నరసింహ మాట్లాడుతూ కమిటీ సభ్యులు నిత్యం పాఠశాలలను పర్యవేక్షిస్తూ విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు మరింత కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్ప, బాలరక్షా భవన్ సభ్యులు ప్రకాష్, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు సాయికుమార్, హనిమిరెడ్డి, రజిత, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్లు సుధాకర్, శేఖర్, విక్రమసింహారెడ్డి, లక్ష్మీదేవి, నాగమ్మ, గ్రామ కన్వీనర్లు ఉన్నారు.

● మానవపాడు : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఎంపీడీవో భాస్కర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతస్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో దాడి చేసిన పోలీసులపై ఎస్పీకి ఫిర్యాదు

గద్వాల క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ సందర్భంగా తనపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చిన కే.టి.దొడ్డి ఎస్ఐతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కే.టి.దొడ్డి మండల పరిధిలోని సుల్తానాపురానికి చెందిన బాధితుడు కుర్వ రాముడు మంగళవారం గద్వాల ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుల్తానాపురానికి చెందిన బాధితుడు ఈ నెల 22న సాయంత్రం ఫర్టిలైజర్ కొరకు నందిన్నె గ్రామానికి వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం మద్యం తాగి వాహనంపై వెళ్తుండగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఓ కానిస్టేబుల్ తన దగ్గరకు వచ్చి ఊదమన్నాడని, తాను కొద్దిగానే మద్యం తాగానని చెప్పడంతో తనపై ఎస్ఐతో పాటు సిబ్బంది కట్టెలతో దాడిచేశారని తెలిపారు. దీంతో తొడలు, ఎడమచేయి పూర్తిగా కందిపోయి వాసిందని పేర్కొన్నారు. ఈ విషయంపై కే.టి.దొడ్డి ఎస్ఐ శ్రీనివాసులును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, డ్రంకెన్ డ్రైవ్ విషయంలో పోలీసులకు ఇబ్బంది కల్పించి, మద్యం మత్తులో మిషన్‌ను పగలగొట్టాడని, పోలీసులపై దాడి చేసేందుకు యత్నించారని తెలిపారు.

సంగాలలో వివాహిత ఆత్మహత్య

గద్వాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గద్వాల రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. రూరల్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన పద్మమ్మ(45) కుటుంబ సమస్యల కారణంగా మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అయితే అపస్మారక స్థితిలో ఉన్న పద్మమ్మను కుటుంబ సభ్యులు గమనించి కర్నూల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఆమె భర్త నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బాలల పరిరక్షణ కమిటీ బాధ్యతలపై అవగాహన

ఇటిక్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో సుజాత మాట్లాడుతూ మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ బాధ్యతలు, విధుల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మండలంలోని అన్నిగ్రామాల బాలల పరిరక్షణ కమిటీలను సమన్వయం చేసుకోవడం ఈ కమిటీ బాధ్యత అని, బాలల సమస్యలపై అవగాహన పెంచడంలో సమస్యల పరిష్కారంలో మండల కమిటీ అవసరమైన శిక్షణను, తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి బాలల పరిరక్షణ అధికారి జోగు రవి మాట్లాడుతూ బాలలపై లైంగిక వేధింపుల చట్టం ప్రకారం అమ్మాయిలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినట్లయితే వారికి కనీసం ఏడు సంవత్సరాల వరకు జైలుశిక్ష ఉంటుందని వివరించారు. బడి మానేసిన పిల్లలు ఎవరైనా ఉంటే ఆ పిల్లలను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని కోరారు. 18సంవత్సరాలలోపు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం విధించే శిక్ష గురించి వివరించారు. అనంతరం బాలలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెండెంట్ జయరాములు, ఆర్ఐ మదన్‌మోహన్, మెడికల్ ఆఫీసర్ రాధిక, శేఖర్, హెడ్ కానిస్టేబుల్ జయప్రకాష్, మహిళా సమైఖ్య సీసీ బీచుపల్లి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం మార్చి 2న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షుడు విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బహిరంగసభకు పెద్దఎత్తున తరలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగార్జునగౌడు, సెంట్రల్ రాష్ట్ర కార్యదర్శి భీమన్న, జిల్లా నాయకులు మురళి, జగన్ భద్రునిషాబేగం, అర్పిత ఉన్నారు.

విద్యార్థుల్లో ఆలోచన శక్తిని పెంచాలి

కేటీదొడ్డి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆలోచనశక్తిని పెంచే కార్యక్రమాలు పాఠశాలలో నిర్వహించాలని మల్లాపురం తండా పంచాయతీ కార్యదర్శి జిషన్ నైమహద్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాపురం తండా మండల ప్రజా పరిషత్ పాఠశాలలో సమగ్ర శిక్షణ అభియాన్, ఎంవీ సంస్థ, మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సబ్జెక్ట్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంవీ సంస్థ మండల ఇన్‌చార్జ్ కిరణ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ సభ్యుడు పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయి విద్య

గద్వాలసర్కిల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని గద్వాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ డ్రైవ్‌లో భాగంగా కళాశాల అధ్యాపక బృందం మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యనభ్యసించడం వల్ల ఉచిత పుస్తకాలతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందవచ్చని తెలిపారు. ఆయా కళాశాలల హెచ్ఎం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) :మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని పట్టణంలోని పలుఆలయాలు ముఖ్యంగా శైవ ఆలయాలు మంగళవారం రాత్రి ముస్తాబయ్యాయి. ఆలయాలకు రంగురంగుల విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసి పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకునేందుకు ఆయా ఆలయాల నిర్వాహకులు సిద్ధమయ్యారు.స్థానిక భద్రకాళీ సమేత వీరభద్ర ఆలయంలో శివుడికి భస్మ జల అభిషేకం చేయించేందుకు ఏర్పాటు చేశామని అర్చకుడు శివరాజస్వామి తెలిపారు.

ఆలయాల్లో బందోబస్తు

అలంపూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి మహోత్సవాలకు అలంపూరు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ టాటా రవిబాబు తెలిపారు. పట్టణంలోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో ఎస్ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పదిమంది ఎస్సైలు, ఇద్దరు సీఐలు, 200మంది కానిస్టేబుళ్లు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు.

జములమ్మకు తగ్గిన భక్తులు

గద్వాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జములమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు తగ్గారు. శివరాత్రి, అమావాస్యతో మంగళవారం తక్కువ సంఖ్యలో భక్తులు వచ్చారు. సుమారు 10వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ, చైర్మన్ వెంకట్రాములు తెలిపారు. భక్తులకు ఉచిత సర్వదర్శనంతో పాటు రెండు ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లో భక్తుల కోసం కూలర్లను ఏర్పాటు చేశారు. ఆవరణలో చలువ పందిళ్లు వేయడంతో ఎండ సమయంలో అక్కడ భక్తులు సేదతీరుతున్నారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



తుపతురాలలో బాధితుడు పరశురాముడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు

అయిజ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తుపతురాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుడ్డన్న కుమారుడు పరశురాముడు పూర్తిస్థాయి అస్వస్థతకు గురయ్యాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అవసరం మేరకు ఎరువుల నిల్వలు ఉండాలి



అయిజ సింగిల్‌విండో ఆధ్వర్యంలోని ఎరువులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి సక్రియనాయక్

- జిల్లా వ్యవసాయాధికారి సక్రియనాయక్

అయిజ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అవసరం మేరకు ఎరువులు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి సక్రియనాయక్ ఆదేశించారు. మంగళవారం అయిజ సింగిల్‌విండో ఆధ్వర్యంలోని ఎరువులను పరిశీలించారు. గోదాములోని నిల్వలను, రైతులకు విక్రయిస్తున్న పురుగుల మందు దుకాణాలను పరిశీలించారు. ప్రైవేటు యాజమాన్యాలు సైతం అవసరమైన మేరకు నిల్వలు ఉంచాలని తెలిపారు. ఎరువులు లేవని ఫిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు విక్రయించాలని తెలియచేశారు. యూరియ బస్తాను రూ. 266.50లకే విక్రయించాలని తెలిపారు. అంతకుముందు అయిజలోని వ్యవసాయ కార్యాలయాన్ని సందర్శించారు. వివిధ గ్రామాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులతో సమావేశం నిర్వహించారు. వారితో వివిధ వ్యవసాయ సంబంధిత అంశాలు గురించి చర్చించారు. అక్కడికి వచ్చిన రైతులకు రైతుకు సంబంధించిన రైతుభరోసా, పీఎం కిసాన్, పంట నమోదు గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమములో సింగిల్‌విండో అధ్యక్షుడు మదుసూదన్‌రెడ్డి, కార్యదర్శి మల్లేష్, ఫర్టిలైజర్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సర్వం కోల్పోయాం.. ఆదుకోండి

- తహసీల్దార్‌కు అగ్నిప్రమాద బాధితుల వినతి



అగ్నిప్రమాద బాధితులకు బియ్యం అందజేస్తున్న నాయకులు

అయిజటౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మంగళవారం తహసీల్దార్ జ్యోతిని బాధితులు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 15ఏళ్లుగా అయిజలోని భరత్‌నగర్‌కాలనీలో గుడిసెలు నిర్మించుకున్నామని, వివిధ ప్రాంతాల్లో గాజుల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నామని తెలిపారు. గుడిసెలతో పాటు కొంతనగదు, తిండిగింజలు, దుస్తులు, గాజులు కాలిపోవడంతో రెండు కుటుంబాలు రోడ్డునపడ్డాయని బాధితులు వెంకటరమణ, వెంకటమ్మ, రమేష్, రాజు తెలిపారు.

బాధితులకు ఆర్థిక సాయం

అయిజలోని భరత్‌నగర్ కాలనీలో ఆదివారం రెండు గుడిసెలు కాలిపోయిన వెంకటరమణ, వెంకటమ్మ, రాజు, రమేష్‌కు స్థానిక కాంగ్రెస్ నాయకులు షెక్షావలి ఆచారి, సురేష్‌గౌడు, మధుకుమార్ రూ.5వేలునగదు, 25కిలోల బియ్యం అందజేశారు. అలాగే స్థానిక బీజేపీ నాయకులు భగత్‌రెడ్డి, ప్రదీప్‌స్వామి బాధితులకు ఒక పాకెట్ బియ్యం అందజేశారు. ప్రభుత్వ అధికారులను సంప్రదించి ప్రభుత్వం ద్వారా సాయం అందేలా కృషి చేస్తామని బాధితులకు వారు తెలిపారు.

ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

● ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య

గద్వాల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఐక్య పోరాటాలతో తిప్పికొట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య పిలుపునిచ్చారు. మార్చి 5 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే అవగాహన ప్రచార కార్యక్రమాలకు సంబంధించి మంగళవారం పట్టణంలోని టీజేఎస్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడిన జక్కుల వెంకటయ్య, కేంద్రం గతంలో తెచ్చిన మూడు నూతన వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తామని రాత పూర్వకంగా హామీ ఇచ్చి తిరిగి వాటిని అమలులోకి తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నం గర్హనీయమన్నారు. రైతు సంఘాలతో చర్చించకుండా విద్యుత్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం, హామీ ఇచ్చి పట్టించుకోకపోవడం రైతులను మోసగించడమేనన్నారు. ఇటీవల కేంద్ర వార్షిక బడ్జెట్‌లో సాగు రంగానికి నిధుల కోత విధించడం, ఎరువుల సబ్సిడీని తగ్గించడం, పంట ఉత్పత్తి ధరల స్థిరీకరణ నిధిని పెంచకపోడం వ్యవసాయ రంగం పట్ల కేంద్రానికి ఉన్న నిర్లక్ష్యాన్ని మరోసారి బయటపెట్టిందన్నారు. తెలంగాణ ఫసల్ బీమా పథకాన్ని మరింత సమర్థంగా చేయాలని రైతు సంఘాలు ముక్తకంఠంతో కోరుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధ్యతారాహిత్యమన్నారు. కిసాన్ మోర్చా చేపట్టే ఆందోళనలో రైతులతో పాటు కార్మిక, ప్రజా, రైతు సంఘాల నాయకులు, మేధావులు భాగస్వాములుకావాలని కోరారు. సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, టీవీఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాషా, ప్రజాసంఘాల నాయకులు ఆశన్న, సత్యారెడ్డి, మహేష్, కృష్ణ, రేణుక ఉన్నారు.

అక్రమంగా వేసుకున్న గుడిసెలు తొలగించాలి

● కమిషనర్‌కు కాలనీవాసుల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐడీఎస్ఎంటీ కాలనీవాసులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో అక్రమంగా వెలసిన గుడిసెలను తొలగించాలని కాలనీవాసులు కోరారు. అసంపూర్తిగా మిగిలిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కమిషనర్‌కు వివరించారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్ దశరథ్‌ను కలిసి కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అధికారికంగా ఏర్పాటు చేసిన ఐటీఎస్ఎంటీ కాలనీలో పబ్లిక్ అవసరాల కోసం ఉద్దేశించిన పదిశాతం స్థలంలో కొంత మంది అక్రమంగా గుడిసెలు ఏర్పాటు చేసుకుని స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఇదే విషయాన్ని ఇప్పటికే తాము పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చామన్నారు. కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పనులు అసంపూర్తిగా మిగిలాయని, అర్థాంతరంగా ఆగిన డ్రైనేజీల్లో మురుగునీరు, చెత్త పేరుకు పోవడంతో దోమల బెడద పెరిగిందన్నారు. ఇటీవల కాలనీకి చెత్త సేకరణ వాహనం సరిగ్గా రాకపోవడం సమస్యగా మారిందన్నారు. అక్రమ గుడిసెలు తొలగించి కాలనీ సమస్యలు పరిష్క రించాలని కమిటీ బాధ్యులు నరసింహులు, చెన్నకేశవులు, సుభాన్, శ్రీరాములు కోరారు.